AKSHARA TODAY


అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatodaynews.com

3-11-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2

హడలెత్తిస్తోన్న కోతులు



2



2

గుండెపోటుతో సొసైటీ డైరెక్టర్ మృతి

బండి సంజయ్‌కు ఘనస్వాగతం..



అక్షరటుడే, ఆర్మూర్ : నిర్మల్ పర్యటనకు వెళ్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు ఆర్మూర్‌లో ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు పెద్దోళ్ల గంగా రెడ్డి, నూతుల శ్రీనివాస్ రెడ్డి, కలిగోట గంగాధర్, పోల్కం వేణు, ఆకుల రాజు, వివేకానంద్, ఉదయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వరిసాగు చేసిన రైతులకు ఈసారి ధర కలిసివస్తోంది. గతంలో ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితులు ఉండేవి. ప్రస్తుతం మిల్లర్లు, స్థానిక వ్యాపారులతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న కొనుగోలుదారులు ధాన్యం సేకరణకు పోటీపడుతుండటంతో రైతులకు మెరుగైన ధర లభిస్తోంది. క్వింటాలుకు రూ.3,300 నుంచి రూ.3,400 వరకు చెల్లిస్తున్నారు. కొన్ని రకాల ధాన్యానికి నాణ్యత, డిమాండ్‌ను బట్టి మరింత ధర పలుకుతోంది.

- అక్షరటుడే, భీమ్‌గల్



రైతన్నకు లాభాల పంట..!

■ ఎల్‌నినోతో ధాన్యానికి డిమాండ్ ■ మద్దతు ధరకు మించి పలుకుతున్న రేటు ■ పోటీ పడి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

నిజామాబాద్ జిల్లా లో ఈ వానాకాలం సుమారు 4.35 లక్షల ఎకరాల్లో వరి సాగైనట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. సుమారు 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని భావిస్తున్నారు. ఇందులో 6.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం 736 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇంత భారీ విస్తీర్ణంలో సాగైన ధాన్యానికి మార్కెట్లోనూ డిమాండ్ ఉండటంతో కొనుగోలుదారులు రైతుల వద్దకు వస్తున్నారు. ముఖ్యంగా పచ్చి ధాన్యాన్నే కల్లాల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తుండటంతో అన్నదాతకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతోంది.

మిల్లర్లకూ ధాన్యం అవసరం

ప్రభుత్వానికి గతంలో కేటాయించిన ధాన్యం నిల్వలు, కస్టమ్ మిల్లింగ్ బియ్యం సరఫరా బాధ్యతల నేపథ్యంలో మిల్లర్లకు ధాన్యం సేకరణ అవసరం ఏర్పడింది. ఈ క్రమంలో కొందరు మిల్లర్లు రైతుల వద్ద నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు ఇతర రాష్ట్రాల వ్యాపారుల రాకతో మార్కెట్లో పోటీ పెరిగింది. ఈ పరిణామం రైతులకు అనుకూలంగా మారుతోంది. గతంలో ధాన్యాన్ని ఆరబెట్టి, తూకం వేయించి కొనుగోలు కేంద్రాలకు తరలించే క్రమంలో రైతులు రవాణా, హమాలీ తదితర ఖర్చులు భరించాల్సి వచ్చేది. ప్రస్తుతం పలుచోట్ల వ్యాపారులే నేరుగా రైతుల కల్లాల వద్దకు వచ్చి పచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. తేమశాతం, ధాన్యం రకం, నాణ్యత ఆధారంగా ధర నిర్ణయిస్తున్నారు.

పోటీతో పెరిగిన ధరలు

గతంలో సాధారణ సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2,300 మద్దతు ధర లభించేది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో కొనుగోలుదారుల మధ్య పోటీ నెలకొనడంతో పచ్చి ధాన్యానికే రూ.3,300 నుంచి రూ.3,400 వరకు ధర పలుకుతోంది. ముఖ్యంగా బీపీటీ వంటి సన్న రకాలపై వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోళ్లు సాగిస్తున్నారు. రైతులకు పంటను విక్రయించేందుకు అవకాశాలు పెరిగాయి.

అన్నదాతకు మేలు

సాగు ఖర్చులు పెరుగుతున్న తరుణంలో మరోవైపు పంటకు మెరుగైన ధర లభించడం రైతులకు ఊరటనిస్తోంది. ప్రభుత్వ మద్దతు ధరతో పోలిస్తే బహిరంగ మార్కెట్లో ఎక్కువ ధర లభించే పరిస్థితి ఏర్పడింది. కొనుగోలుదారుల మధ్య పోటీ కొనసాగితే రైతులకు మరింత ప్రయోజనం చేకూరే అవకాశముంది.



కమ్మేసిన పొగ మంచు

మండలంలోని చావుని తండా, పోచారం, శివ్వపూర్, తలాబ్ తండా, పరిసర గ్రామాలలో తెల్లవారుజాము నుంచి మంచు దట్టంగా కమ్మేసింది. ఉదయం 8 గంటలు దాటినా పొగమంచు తొలగకపోవడంతో రహదారులు సైతం స్పష్టంగా కనిపించలేదు. చుట్టూ మంచు మేఘాలు అలుముకోవడంతో గ్రామాలు, పంట పొలాలు మంచు తెరలో మునిగిపోయాయి. ఉదయం వేళల్లో వాహనదారులు రహదారులపై ప్రయాణించేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చలిగాలులు, దట్టమైన పొగమంచుతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి ఇబ్బందులు పడ్డారు. ప్రకృతి అందాలు మంచు దుప్పటిలో కనువిందు చేసినప్పటికీ, పంటలపై మంచు ప్రభావం ఎలా ఉంటుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– రాజేందర్, అక్షరటుడే, పెద్దకొడప్‌గల్



జవహర్ నవోదయ క్యాంపస్ పనులను వేగంగా పూర్తిచేయాలి: కలెక్టర్ ఇలా త్రిపాఠి

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: జక్రాన్‌పల్లి మండలం కలిగోట్‌లో జవహర్ నవోదయ విద్యాలయ క్యాంపస్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఈ మేరకు మంగళవారం నిర్మాణ ప్రదేశాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించారు. జేపీఎన్ నిర్వహణకు అనువైన పరిస్థితులు, అందుబాటులో ఉన్న వసతులను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. ఇప్పటివరకు చేపట్టిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనులను నాణ్యతతో వేగంగా జరిపించాలని, విద్యార్థులకు అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. తరగతి గదులు, డార్మెటరీ, డైనింగ్ హాల్, లైబ్రరీ, బాలబాలికలకు వేర్వేరుగా హాస్టల్ భవనాలు, స్టాఫ్ క్వార్టర్స్ కోసం నిర్మించనున్న భవన సదుపాయాల బ్లూప్రింట్‌ను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులతో పాటు అధ్యాపకులు, సిబ్బందికి తగిన వసతి, బోధనా తరగతుల నిర్వహణ వంటి వాటికి ఇబ్బందులు లేకుండా అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులకు అవసరమైన ఇసుక, మొరం నిల్వలకు నిబంధనల మేరకు అనుమతులు మంజూరు చేయాలని స్థానిక రెవెన్యూ అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయి లో పరిశీలిస్తూ.. నిర్మాణ పనుల ప్రగతి గురించి తనకు నివేదించాలని ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియకు సూచించారు.

తెయూలో సీట్లను భర్తీ చేయాలి



అక్షరటుడే, తెయూ క్యాంపస్: తెలంగాణ యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న పీజీ సీట్లను స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయాలని బీసీ ఏఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండల ప్రదీప్ డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో ప్రతి ఏడాది వివిధ కోర్సులలో సీట్లు మిగిలిన అధికారులు భర్తీ చేయడానికి అవకాశం ఉన్న పట్టించుకోవడం లేదన్నారు. యూనివర్సిటీ ఏర్పాటు చేసిందే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలని, ఏట సీట్లు మిగిలి ఉన్న వాటికి స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. అనంతరం వీసీ యాదగిరిరావుకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు సందీప్, ప్రశాంత్, నాగమణి, అనూష, సుజన, భాస్కర్, కృష్ణ ప్రసాద్, సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాధవ్ నగర్ ఆర్‌వోబీకి అదనపు నిధులు మంజూరు.. ఎంపీ అర్వింద్ హర్షం



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ : జిల్లావాసులు ఎన్నో ఏళ్లుగా నిరీక్షిస్తున్న మాధవ్ నగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) నిర్మాణానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నాలుగు వరుసల ఆర్‌వోబీ నిర్మాణానికి రూ.101.80 కోట్లతో సవరించిన పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ జీవో జారీ చేసింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి రెండేళ్లుగా అదనపు నిధుల మంజూరు, సవరించిన అంచనాలకు సంబంధించిన పరిపాలనా అనుమతులు పెండింగ్‌లో ఉండటంతో నిర్మాణ పనులు ఆశించిన వేగంతో ముందుకు సాగలేదు. ఆర్వోబీ నిర్మాణం కోసం.. ఎంపీ ధర్మపురి అర్వింద్ పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వానికి, సంబంధిత మంత్రులకు విజ్ఞప్తులు చేశారు. గతంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కూడా కలిసి అదనపు నిధుల అవసరాన్ని వివరించారు. స్పందించిన కోమటిరెడ్డి ఫైల్ ని క్లియర్ చేసి ఆర్థిక శాఖకి పంపారు. అక్కడ ఫైల్ క్లియర్ కాకపోవడంతో ప్రజల ఇబ్బందులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు అక్టోబర్ 27న మాధవ్ నగర్ ఆర్ఓబీ వద్ద ఎంపీ అర్వింద్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. నిధులు మంజూరు చేయాలని, ఎంపీ స్వయంగా భిక్షాటన చేపట్టారు. అనంతరం అక్టోబర్ 29న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి మాధవ్ నగర్ ఆర్ఓబీకి సంబంధించిన రూ.8.68 కోట్ల అదనపు నిధులకు ఆర్థిక, పరిపాలనా అనుమతులు మంజూరు చేయాలని ఎంపీ అర్వింద్ విజ్ఞప్తి చేశారు. ఎంపీ కృషితో ప్రభుత్వం సోమవారం అదనపు నిధుల మంజూరుకు పరిపాలన అనుమతులు జారీ చేసింది. నిధుల మంజూరుపై ఎంపీ హర్షం వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. ఆర్ఓబీ పూర్తయితే ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు గణనీయంగా తగ్గుతాయన్నారు.

పెండింగ్ రోడ్డు పనులపై ఎమ్మెల్యే మదన్‌మోహన్ ప్రత్యేక దృష్టి



అక్షరటుడే, ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న బీటీ రోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టేందుకు ఎమ్మెల్యే మదన్‌మోహన్ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు పంచాయతీరాజ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) జగదీశ్వర్‌ను కలిసి అభివృద్ధి పనులపై చర్చించారు. రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరై, కాంట్రాక్టర్లు అగ్రిమెంట్లు చేసుకుని నాలుగైదు ఏళ్లు గడుస్తున్నప్పటికీ పనులు ప్రారంభించకపోవడంపై ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నాగిరెడ్డిపేట మండలంలో గోలిలింగాల, రాఘవపల్లి, ఎర్రారం, ఆత్మకూరు, బొల్లారం మీదుగా జప్తి జానకంపల్లి రోడ్డు, తాండూర్ నుంచి మసానిపల్లి రోడ్డు, వాడి మీదుగా చీనూర్ రోడ్డు నిర్మాణాలను చేపట్టాలని కోరారు. సదాశివనగర్ మండలంలో ఉత్నూర్ నుంచి తుక్కోజివాడి మీదుగా భూమ్‌పల్లి రోడ్డు, జాతీయ రహదారి44 నుంచి ధర్మారావుపేట మీదుగా అమర్లబండ రోడ్డు, ఎల్లారెడ్డి మండలంలో వెల్లుట్ల మీదుగా తిమ్మారెడ్డి రోడ్డు నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. గాంధారి నుంచి చద్మల్‌తండా మీదుగా పిస్కుల్ గుట్ట తండా, పెద్ద గుజ్జుల్ తండా, చిన్న గుజ్జుల్ తండా, లోంక తండా, దావు తండా, బీర్మల్ తండా వరకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు.నియోజకవర్గంలోని ఇతర ముఖ్యమైన రోడ్ల పనులను కూడా వేగవంతం చేయాలని సూచించారు.

మున్సిపల్ సమస్యలపై బీఆర్ఎస్ ఫిర్యాదు



అక్షరటుడే, కామారెడ్డి: మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ కాసర్ల గోదావరి ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గిరికి కూడా వినతిపత్రం సమర్పించారు. గత నెలలో జరిగిన గణపతి నిమజ్జనం, దుర్గామాత నిమజ్జన కార్యక్రమాల తర్వాత ఏర్పడిన స్క్రామ్, విగ్రహాలకు సంబంధించిన స్టాండ్ లు, ఇతర సామానును కౌన్సిల్ కు తెలియకుండా అక్రమంగా విక్రయించారని పేర్కొన్నారు. కామారెడ్డి పట్టణంలోని అశోక్ నగర్ కాలనీలో సర్వే నంబర్ 218, 219, ఎల్.పి. నంబర్ 135/1985 లో గల ఎకరం ఏడు గుంటల విస్తీర్ణం గల మున్సిపల్ ఓపెన్ స్థలంలో అక్రమంగా కబ్జా చేసి కొత్తగా నిర్మాణం చేపడుతున్నారని, ఇదే స్థలంలో గతంలో రెండు నిర్మాణాలు చేశారని తెలిపారు. దీనికి అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు సహకరిస్తున్నారని ఆరోపించారు. ఈ అక్రమ నిర్మాణాలను కూల్చివేసి విలువైన మున్సిపల్ ఆస్తిని అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వైస్ ఛైర్‌పర్సన్ కాసర్ల గోదావరి స్వామితో పాటు కౌన్సిలర్లు పాల్గొన్నారు

ఆరుతడి పంటలతోనే నీటికొరతను అధిగమించవచ్చు



అక్షరటుడే, భీమ్‌గల్: ఎల్‌నినో ప్రభావం వల్ల ఉష్ణోగ్రతలు పెరిగి, రాబోయే రోజుల్లో భూగర్భ జలాలు మరింత తగ్గే ప్రమాద ముందని వ్యవసాయ విస్తరణ అధికారి స్నేహ అన్నారు. భీమ్‌గల్ మండలంలోని చేంగల్, బడా భీమ్‌గల్ గ్రామాల్లో రైతులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన ప్రత్యేక అవగాహన సమావేశాల్లో ఆమె మాట్లాడారు. ఒక్క ఎకరం వరి సాగుకు సుమారు 30 నుంచి 40 లక్షల లీటర్ల నీరు అవసరమవుతుందని, కాబట్టి రైతులు నీటి వినియోగం తక్కువగా ఉండే ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని సూచించారు. వరికి బదులుగా తక్కువ నీటితో అధిక దిగుబడినిచ్చే మొక్కజొన్న, జొన్న, పొద్దుతిరుగుడు, కుసుమ, పెసలు, మినుములు, నువ్వులు వంటి పంటలను సాగు చేయాలని కోరారు. నీటి కొరతను సమర్థవంతంగా అధిగమించడానికి ప్రతీ రైతు పంటల వైవిధ్యీకరణను పాటించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశాల్లో చేంగల్, బడా భీమ్‌గల్ గ్రామాల సర్పంచ్‌లు దూమల మమతా రాజు, రాచకొండ విష్ణువర్ధిని, ఉప సర్పంచ్‌లు నటి మోహన్ గౌడ్, రాచకొండ శంకర్ గౌడ్ పాల్గొన్నారు.

సీతాయిపల్లిలో రీసర్వే పనులను పరిశీలన



అక్షరటుడే, ఎల్లారెడ్డి: గాంధారి మండలం సీతాయిపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీసర్వే పనులను మంగళవారం ఎల్లారెడ్డి ఆర్డీవో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న సర్వే ప్రక్రియ, భూముల క్షేత్ర కొలతలు, ఎఫ్ఎంబీ స్కెచ్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో నేరుగా మాట్లాడిన ఆర్డీవో భూ సంబంధిత సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రీసర్వే పనులను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పందశాతం కచ్చితత్వంతో నిర్వహించాలని అధికారులకు సూచించారు. సర్వే ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. నిర్ణీత గడువు లోగా రీసర్వే పనులను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్వే బృందం సభ్యులు, రెవెన్యూ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి..



అక్షరటుడే, ఇందూరు: ఆర్టీసీ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని బోధన్ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎన్. శ్రీనివాస్ పేర్కొన్నారు. నిజామాబాద్ రీజియన్ పరిధిలోని ఆర్టీసీ డ్రైవర్లకు రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ, సురక్షిత ప్రయాణంపై మంగళవారం రీజియన్ మేనేజర్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఎంవీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, వేగ నియంత్రణ, రహదారి సంకేతాలను గమనించాలన్నారు. వాహనం నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే విధి నిర్వహణలో క్రమశిక్షణ, సహనం, సమయపాలన పాటిస్తూ ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. ప్రతి డ్రైవర్ బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ రీజినల్ మేనేజర్ జ్యోతి మాట్లాడుతూ, ప్రయాణికుల భద్రతే టీజీఎస్ఆర్టీసీ ప్రధాన ధ్యేయమని, డ్రైవర్లు నిరంతరం శిక్షణ తరగతుల్లో పాల్గొంటూ తమ నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 34 మంది డ్రైవర్లు పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఇద్దరికి ఏడురోజుల జైలు..

అక్షరటుడే, నిజామాబాద్ క్రైం: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఇద్దరు వ్యక్తులకు న్యాయస్థానం ఏడు రోజుల జైలుశిక్ష విధించింది. ఈ మేరకు ట్రాఫిక్ పోలీసులు వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ టౌన్ 1 పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు దమ్ము నవీన్, నసీరుద్దీన్ మద్యం తాగి వాహనం నడుపుతున్నట్లు గుర్తించారు. వీరిద్దరిని మంగళవారం స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా.. ఒక్కొక్కరికి ఏడు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా టౌన్ 1 పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో శ్రీనివాస్ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉందని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆర్మూర్ పట్టణంలో కోతుల బెడద రోజురోజుకూ శృతిమించుతోంది. వీధుల్లో, ఇళ్లపై, దుకాణాల్లో కోతులు గుంపులుగా స్వైర విహారం చేస్తున్నాయి. కోతుల దాడులతో ప్రజలు విలవిలలాడుతున్నారు. మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
– అక్షరటుడే, ఆర్మూర్



హడలెత్తిస్తోన్న కోతులు

■ ఆర్మూర్ పట్టణంలో వానరాల స్వైరవిహారం.. ■ ప్రజలపై దాడులు చేస్తున్న వైనం ■ పట్టించుకోని మున్సిపల్ అధికారులు

ఆర్మూర్‌లో పట్టణంలో కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. హౌసింగ్ బోర్డు కాలనీ, కింది బజార్, మీది బజార్, ఆలూరు రోడ్డు, రాజారాం నగర్, జర్నలిస్ట్ కాలనీ, రాంనగర్, మామిడిపల్లి, పెర్కిట్ కాలనీల్లో కోతుల సంఖ్య విపరీతంగా పెరిగింది. ఉదయం, సాయంత్రం వేళల్లో గుంపులుగా వచ్చి ఇళ్లలోకి చొరబడి కూరగాయలు, పండ్లు, ఆహార పదార్థాలు ఎత్తుకెళ్తున్నాయి. పిల్లలు, వృద్ధులు బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పలువురు చిన్నారులు, వృద్ధులపై కోతులు దాడి చేసి గాయపరిచిన ఘటనలు జరిగినా అధికారుల్లో చలనం లేదన విమర్శలు వెల్లువెత్తుతున్నాయి

అధికారుల నిర్లక్ష్యమే కారణమా..

పట్టణంలో 36 వార్డులు ఉండగా జనాభా 80వేలకు పైగా ఉంది. 30వరకు కాలనీలు ఉన్నాయి. అయితే పట్టణంలో ఇష్టారాజ్యంగా కోతులను పట్టి అడవుల్లో వదిలేయాలని పలుమార్లు మున్సిపాలిటీకి వినతులు ఇచ్చినా అధికారులు మొద్దు నిద్ర వీడడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. నిధులు లేవు, సిబ్బంది లేరంటూ సాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. నిజామాబాద్, కామారెడ్డి మున్సిపాలిటీలు కోతుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతుంటే, ఆర్మూర్ మున్సిపాలిటీ మాత్రం చోద్యం చూస్తోందని ప్రజలు మండిపడుతున్నారు.

కొండెంగల ఫ్లెక్సీలు కడుతూ..

పట్టణం మొత్తం కోతులు రణరంగం చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ఆయా కాలనీల్లో కమిటీలే ముందుకు వస్తున్నాయి. అలాగే స్వచ్ఛందంగా కొందరు కొండెంగల ఫ్లెక్సీలు కడుతున్నారు. వీటిని చూసైనా కోతులు పారిపోతాయనే ఆలోచనతో పలు చోట్ల ఫ్లెక్సీలుకట్టారు. పట్టణంలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలు ఒక ఎత్తు అయితే, ఇప్పుడు కోతుల బెడద మరో సమస్యగా మారిందని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి కోతుల బెడదను నివారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



ఏఐసీసీ జనరల్ సెక్రెటరీని కలిసిన ఇందూరు కాంగ్రెస్ నాయకులు

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: 'వోట్ బచావో.. దేశ్ బచావో' కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇటీవల ఇందూరు కాంగ్రెస్ నాయకులు ఢిల్లీ వెళ్లారు. కార్యక్రమం విజయవంతం అయిన అనంతరం మంగళవారం ఏఐసీసీ జనరల్ సెక్రటరీ దీపాదాస్ మున్షిని మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నరాల రత్నాకర్, ధర్పల్లి అశోక్ ఉన్నారు.



మెండోరాలో మండల స్థాయి సమావేశం

అక్షరటుడే, మెండోరా: మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి నాగులు అధ్యక్షతన మండలస్థాయి సమావేశం నిర్వహించారు. మండల అభివృద్ధి, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు, ఎల్‌ఆర్‌ఎస్ ప్రభావం తదితర అంశాలపై చర్చించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ప్రత్యేక అధికారి సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో లక్ష్మణ్, గ్రామ సర్పంచులు, పీఏసీఎస్ చైర్మన్ సాయిరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం.. అపోహలను తరిమికొడదాం!



అక్షరటుడే, ఎల్లారెడ్డి: ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం ఎంతో అవసరమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు అన్నారు. మంగళవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో 'ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం.. అపోహలను తరిమికొడదాం' అనే నినాదంతో ఎస్ఐఆర్ ప్రక్రియపై మేధావులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన హక్కు అని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా చూడటమే ఎస్ఐఆర్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి పట్టణ బీజేపీ ప్రధాన కార్యదర్శిగా ఒలేపు రమేష్‌ను నియమించారు. అలాగే సీనియర్ కళాకారుడు చుక్క గోపాల్ గౌడ్‌ను ఎల్లారెడ్డి బీజేపీ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలకిషన్, జిల్లా ఉపాధ్యక్షుడు దేవేందర్, పట్టణ అధ్యక్షుడు రాజేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి రమేష్, నాయకులు సాయిలు, కాశీనాథ్, సాయిలు, ఉత్తమ్, సత్యనారాయణ, బాలరాజ్, మల్లయ్య, శివ పాల్గొన్నారు.

విద్యార్థులను మోసం చేస్తున్న రెసోనెన్స్ విద్యాసంస్థ



అక్షరటుడే, ఇందూరు: అడ్మిషన్ల పేరుతో రెసోనెన్స్ విద్యాసంస్థ యజమాన్యం విద్యార్థులను మోసం చేస్తోందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం నాయక్ ఆరోపించారు. . ఈ మేరకు సుభాష్‌నగర్‌లోని రెసోనెన్స్ కోచింగ్ సెంటర్ ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా రఘురాం నాయక్ మాట్లాడుతూ.. జిల్లా డీఐఈవో, విద్యా శాఖ నుండి ఎటువంటి అనుమతులు లేకపోయినా స్కూల్, కాలేజ్ అడ్మిషన్ నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను సదరు విద్యాసంస్థ మోసంచేస్తోందన్నారు. తక్షణమే ఈ విద్యాసంస్థపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర నాయకులు కిషోర్, నిరాజ్, సన్ని, బాను, రాంచరణ్, దిలీప్, విష్ణు, టోకు తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపుదలకు కృషి చేయాలి



అక్షరటుడే, బాల్కొండ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపర్చేందుకు ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని బాల్కొండ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బట్టు రాజేశ్వర్ సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాల్కొండలో బాల్కొండ, ముప్కాల్ మండలాలకు చెందిన ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు, టీచర్లతో కాంప్లెక్స్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యార్థులకు మిడ్‌లైన్ పరీక్షలను ఆన్‌లైన్ విధానంలో ఏ విధంగా నిర్వహించాలి, డెమో యాప్‌ను ఎలా ఉపయోగించాలి అనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. అలాగే పరక్, దీక్ష, కార్యక్రమాల అమలు, ఆంగ్ల భాషా నైపుణ్యాల అభివృద్ధి, ఇంగ్లిష్ స్పీకింగ్ వంటి ముఖ్యమైన అంశాలపై సమగ్ర శిక్షణ అందించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు సాయిలు, రామకృష్ణ, నటరాజ్, రాజకుమార్ ఉపాధ్యాయులకు వివిధ అంశాలపై మార్గదర్శనం చేసి, ఆచరణాత్మక శిక్షణ అందించారు.

గుండెపోటుతో సొసైటీ డైరెక్టర్ మృతి

అక్షరటుడే, లింగంపేట: మండలంలోని పోతాయిపల్లి మాజీ సర్పంచ్, లింగంపేట సొసైటీ డైరెక్టర్ ఆకుల లక్ష్మీ నారాయణ సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. మంగళవారం ఆయన మృతదేహానికి లింగంపేట సొసైటీ చైర్మన్ నారాగౌడ్ నివాళులు అర్పించారు. ఇటీవలే సొసైటీ డైరెక్టర్‌గా ప్రమాణం చేసిన లక్ష్మీ నారాయణ అకాలమరణం చెందడం చాలా బాధాకరమన్నారు. సొసైటీ తరపున ఆయన అంత్యక్రియలకు రూ. 5వేలను వారి కుటుంబ సభ్యులకు అందజేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పోతాయిపల్లి గ్రామ సర్పంచ్‌గా మంచి పేరు సంపాదించుకున్న లక్ష్మీనారాయణ మృతి పట్ల గ్రామస్తులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో అందరిని కలుపుకొని వెళ్లి మంచి స్వభావం ఉన్న వ్యక్తి అని గ్రామస్తులు పేర్కొన్నారు.

పశువుల పెంపకంపై అవగాహన



అక్షరటుడే, ఎల్లారెడ్డి: మండలంలోని అన్నాసాగర్ గ్రామంలోని పశువులకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశువుల ఆరోగ్య పరిరక్షణపై రైతులకు పశువైద్యురాలు అర్చన అవగాహన కల్పించారు. పశువుల పెరుగుదల ఆరోగ్యం, పాల ఉత్పత్తి మెరుగుపడటంలో నట్టల నివారణ మందు ఎంతో ముఖ్యమని వైద్య సిబ్బంది వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్రవంతి సాయాగౌడ్, ఉపసర్పంచ్ నాగరాజు, వెటర్నరీ డాక్టర్ అర్చన, శ్రీనివాస్ రెడ్డి, సయ్యద్ మహబూబ్, రైతులు, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దూడలకు నట్టల నివారణ మందులు

అక్షరటుడే, ఆర్మూర్: మండలంలోని గోవింద్ పేట గ్రామంలో పశు దూడలకు ఆర్మూర్ పశు వైద్యాధికారి లక్కం ప్రభాకర్ ఆధ్వర్యంలో మంగళవారం నట్టల నివారణ మందులను వేశారు. పశుపోషకుల సహాయార్థం పశు సంవర్ధక, పశు వైద్యశాఖ ఆధ్వర్యంలో ఈనెల 2 నుంచి 7 వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అప్పల గణేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కిసాన్ నగర్ లయన్స్ భవనంలో కంటి వైద్య శిబిరం



అక్షరటుడే, బాల్కొండ: మండల పరిధిలోని కిసాన్ నగర్‌లోని లయన్స్ భవనంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్మూర్ లయన్స్ కంటి ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ పుణ్యరాజు 35 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో మోతిబిందు ఉన్నవారిని గుర్తించి శస్త్ర చికిత్సల కోసం ఆర్మూర్ లయన్స్ కంటి ఆస్పత్రికి తరలించారు. లయన్స్ క్లబ్ రీజనల్ కార్యదర్శి చాకు లింగం, అధ్యక్షుడు యాదగిరి గౌడ్ పాల్గొన్నారు.